క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలో పునర్నిర్మిస్తున్న పాటిమీద దాసాంజనేయ స్వామి ఆలయానికి రిటైర్డు బ్యాంకు ఉద్యోగి కాబోలు లక్ష్మణరావు కుటుంబ సభ్యులు రూ.25,116 విరాళాన్ని శనివారం నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌బీఐ మేనేజర్‌కు అభినందన

తిరువూరు: సైబర్ నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించడంలో విశేష కృషి చేస్తున్నందుకు తిరువూరు భారతీయ స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచి చీఫ్ మేనేజరు రవికుమార్‌ను విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు అభినందించారు. మైలవరంలో శుక్రవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణపై జరిగిన అవగాహన సదస్సులో రవికుమార్ పలు సూచనలు చేశారు. బ్యాంకింగ్ కార్యకలాపాలు, నగదు లావాదేవీల్లో అపరిచిత వ్యక్తుల ద్వారా జరిగే మోసాలను రవికుమార్ వివరించారు. బ్యాంకు ఖాతాదారులను, ప్రజలను చైతన్యపరచడంలో ఆయన చేస్తున్న కృషిని సీపీతో పాటు పలువురు అభినందించారు.

మాజీ సర్పంచి వెంకటేశ్వరరావు మృతి



జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడి మాజీ సర్పంచి గొర్నెని వెంకటేశ్వరరావు (87) శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ఆయన మృతదేహాన్ని రాజకీయ పార్టీల నాయకులు, స్థానికులు సందర్శించి నివాళులర్పించారు.

యురేకా సైన్స్ ఎక్స్‌పోలో పాల్గొనండి: జేవీవీ

గానుగపాడు(తిరువూరురూరల్): విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు, సైన్స్‌పై ఆసక్తి కల్పించేందుకు జన విజ్ఞాన వేదిక యురేకా సైన్స్ ఎక్స్‌పో నిర్వహిస్తోందని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని జన విజ్ఞాన వేదిక మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్ కోరారు. గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ ఎక్స్‌పోపై శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. 8, 9, 10 తగతుల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు తమ సైన్స్ ప్రయోగాలను వీడియోల రూపంలో జనవరి 26 లోగా పంపాలన్నారు. వివరాలకు జేవీవీ మండల కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



మైలవరం: విద్య మన జీవితానికి బలమైన అస్త్రం అని, జ్ఞానం వలనే ఎదుగుదల సాధ్యమవుతుందని రెడ్డిగూడెం ఎంఎస్‌ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం. నాగేశ్వరరెడ్డి అన్నారు. రెడ్డిగూడెంలోని గీతాంజలి స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు శనివారం స్టడీ మెటీరియల్ అందజేసి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

మైలవరం: ఒకేషనల్ విద్యార్థులకు భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని కె. కనకదుర్గ అన్నారు. ఒకేషనల్ విద్య కోర్సులపై అవగాహన కల్పించేందుకు క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా మైలవరంలోని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్ ల్యాబ్స్‌ను శనివారం సందర్శించారు. 9, పది తరగతి విద్యార్థులు, ఒకేషనల్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

నూజివీడు: పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు పాఠశాలల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సమగ్రశిక్ష ఏపీసీ పంకజ్ కుమార్ అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్లో పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన సందర్శించి మాట్లాడారు. అనంతరం ఆయన పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో తయారు చేసిన ఆహార పదార్థాలను ఆయన పరిశీలించి భోజనం చేశారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వత్సవాయి: మిరప రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖాధికారి టి.వర్ధినీకుమారి అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సాగవుతున్న మిర్చి పంటను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కాయతొలుసు పురుగు, లద్దెపురుగు, శనగపచ్చ పురుగు, రబ్బరు పురుగుల నివారణకు క్లోరోపైరిపాస్, క్వినాల్‌పాస్, కార్బరిల్ మందులను పిచికారి చేసుకోవాలన్నారు. ఎండుతెగులు లేకుండా ట్రైకోడర్మా చల్లుకోవడంతోపాటు ట్రైకోడర్మా విరిడి పశువుల ఎరువు, వేపపిండిని కలిపి చల్లుకుంటే నివారణ ఉంటుందన్నారు.

కలపపై కన్ను



జూపూడి, ఇబ్రహీంపట్నం లంక పొలాల్లో నరికిన చెట్ల కలపను రవాణా చేస్తున్న ట్రాక్టర్



మూలపాడు ప్రాంతంలో నరికిన చెట్ల కలపను రవాణా చేస్తున్న గూడ్స్ ఆటో

- యథేచ్ఛగా చెట్ల నరికివేత
- పరిశ్రమలకు తరలిపోతున్న కలప
- వాల్టా చట్టానికి తూట్లు
- కనుమరుగవుతున్న చెట్లు

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని గ్రామాల్లో చెట్లను విచ్చలవిడిగా నరికేస్తున్నారు. ముక్కలుగా చేసి సమీపంలోని ఫ్యాక్టరీలకు అక్రమంగా గూడ్స్ ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నా అడిగే నాథుడు కరువయ్యాడు. పట్టా భూముల్లోనే కాకుండా, రిజర్వు ఫారెస్ట్, ప్రభుత్వ భూముల్లోని చెట్లను కూడా నరికి వేస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, అటవీ శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. వాల్టా చట్టం అమలు చేయడంలో ప్రభుత్వ అధికారులు విఫలం చెందుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అక్రమార్కులకు వరంగా వరదలు

ఇటీవలి కాలంలో కృష్ణానదికి వచ్చిన వరదలతో విద్యుత్ స్తంభాలతో పాటు అనేక వృక్షాలు నేలవాలాయి. కూలిన చెట్లతో పాటు కూలని వృక్షాలను సైతం మిషన్లతో కట్ చేసి మినీ ట్రక్కులు, ట్రాక్టర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వేప, తుమ్మ చెట్లను సైతం అక్రమార్కులు వదలడం లేదు. అక్రమార్కుల దుశ్చర్యలతో వ్యవసాయ భూముల గట్లు, కృష్ణానది పరీవాహక ప్రాంతాలు, ప్రభుత్వ భూములు, రహదారుల వెంట, అటవీ ప్రాతంలో అనేక వృక్షాలు కనుమరుగవుతున్నాయి. చెట్లు అంతరిస్తుండటంపై ప్రజా సంఘాలు, ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

అక్రమంగా ఫ్యాక్టరీలకు తరలింపు

ఇబ్రహీంపట్నం, కొండపల్లి, జి.కొండూరు గ్రామాల పరిధిలోని పారిశ్రామిక వాడల్లో అనేక పరిశ్రమలు ఇప్పటికే ఏర్పడ్డాయి. పరిశ్రమల్లో వస్తు ఉత్పత్తికి బాయిలర్లు మండించాల్సి ఉంది. అందుకు అవసరమైన వేడిని ఎలక్ట్రికల్ పరికరాలతో చేయాల్సి ఉంది. అయితే అతి తక్కువ ఖర్చుతో కలప లభించడంతో బాయిలర్లను మండించేందుకు ఫ్యాక్టరీల యాజమాన్యాలు కలప వ్యాపారులతో కుమ్మక్కయ్యారు. ఫ్యాక్టరీలు, ఇటుక బట్టీలు, లైట్ వెయిట్ బ్రిక్స్ తయారీ కంపెనీల ఏర్పాటు ఈ ప్రాంతంలో చెట్ల నరికి వేతకు ఆజ్యం పోసినట్లయింది. ఇటుక బట్టీలు, లైట్ వెయిట్ బ్రిక్స్ కంపెనీల ముసుగులో వ్యాపారులు ఇష్టారాజ్యంగా చెట్లు నరికి ఫ్యాక్టరీలకు తరలించడంతో అక్రమార్కులకు కలప వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా వర్థిల్లుతోంది. అక్రమ కలప రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యం.

వాల్టా చట్టానికి తూట్లు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చెట్ల నరికివేత నివారణ, కలప అక్రమ రవాణాను అరికట్టడం, ఇసుక అక్రమ తరలింపు కట్టడి, వాతావరణ సమతుల్యం కోసం తీసుకొచ్చిన వాల్టా చట్టం నిరుపయోగంగా మారింది. కలప అక్రమ రవాణా నియంత్రణను మండల స్థాయిలో ఏ అధికారి పట్టించుకోవడం లేదు. రైతులు సైతం వ్యవసాయ భూముల్లో చెట్లు నరికి వేయాలంటే మండల రెవెన్యూ కార్యాలయాల్లో ముందస్తు దరకాస్తు చేసుకోవాల్సి ఉంది. కానీ దళారులు యథేచ్ఛగా ఎక్కడబడితే అక్కడ చెట్లు నరుకుతున్నా అధికారుల్లో స్పందన కరువైంది. ప్రభుత్వంతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థలు లక్షలు ఖర్చు చేసి మొక్కలు నాటుతున్నారు. రాత్రీ,పగలు యథేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేసిన ఘటన ఒక్కటీ లేదు. అధికారులు మేలుకోకుంటే భవిష్యత్‌లో ఎన్ని మొక్కలు నాటినా నిష్ప్రయోజనమే అని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెట్ల అక్రమ నరికివేత, రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ రవాణా దారులపై చర్యలు తీసుకుంటాం



కలప అక్రమ రవాణా విషయం నా దృష్టికి వచ్చింది. చెట్లు నరికి వేయడం, కలప అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరం. కలప అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకుంటాం. ఆయా గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేస్తాం. పారిశ్రామికవేత్తలు కలప వినియోగిస్తున్నట్లు అయితే ప్రత్యామ్నాయం చూసుకోవాలి.

– వై.వెంకటేశ్వర్లు, తహసీల్దార్, ఇబ్రహీంపట్నం

పర్యావరణానికి హాని



అక్రమంగా వృక్షాలు నరికి వేయడం పర్యావరణ పరిరక్షణకు హాని కలుగుతుంది. ఫ్యాక్టరీలు, ఇటుక బట్టీల ముసుగులో వన సంపద తరలిపోతుంది. పర్యావరణ పరిరక్షణ, వాల్టా చట్టం కాగితాలకే పరిమితం అయింది. వృక్షాల నరికివేతను అరికట్టేందుకు సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

– ఎ.సుశీల్, స్థానికుడు, జూపూడి

అటవీ భూములపై హక్కు కల్పించాలని వినతి

నూజివీడు: చాట్రాయి మండలం చిత్తపూరుకు చెందిన పేదలు 70 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న అటవీ భూములపై వారికి హక్కు కల్పించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ శనివారం కోరారు. దీనిపై అధికారులు 15 రోజుల్లోగా స్పందించి సమస్యను పరిష్కరించని పక్షంలో నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద 24 గంటల మహా ధర్నాను నిర్వహిస్తామని చెప్పారు. ఇటీవల ఆరుగొలను పేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని పలువురు అధికారులకు అర్జీలు అందజేశారని చెప్పారు. పేదలకు సాగు చేసుకుంటున్న భూములు తప్ప వేరే స్థిర, చర ఆస్తులు లేవని, వారికి న్యాయం జరిగే వరకూ లిబరేషన్ అండగా నిలుస్తుందన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

ఇబ్రహీంపట్నం: జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు జనవరి నెల సామాజిక పింఛన్లు డిసెంబర్ 31వ తేదీన అన్ని గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారులకు అందజేస్తామని ఎంపీడీఓ సునీతశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల పింఛన్లు మొత్తం 4,780 మందికి గ్రామ సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేస్తారన్నారు.

నోట్‌బుక్స్, ప్యాడ్స్ పంపిణీ

కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరం ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి షేక్ కరీముల్లా నోట్ బుక్స్, రైటింగ్ ప్యాడ్స్ శనివారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్నేహపూర్వక పోటీతత్వంతో లక్ష్యాలు నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని నాగమల్లేశ్వరి, హిందీ ఉపాధ్యాయుడు మహ్మద్ ఇర్ఫాన్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయాకు సన్మానం

చాట్రాయి: చీపురుగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న ఆయా పొన్నుబోయిన సీతామహాలక్ష్మి రిటైర్డ్ సందర్భంగా శనివారం అంగన్‌వాడీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రి, పలు పార్టీల నాయకులు జగదీష్, వసంతరావు, మన్మధరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

చాట్రాయి: రానున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ బ్రహ్మచారి అన్నారు. సి గుడిపాడు హైస్కూల్‌ను శనివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌ఏ- 1 ఫలితాలు 100 రోజుల ప్రణాళికపై సమీక్ష నిర్వహించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

అనంతరం రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తయారు చేసిన స్టడీ మెటీరీయల్‌ను ఆయన ఆవిష్కరించారు. ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వీరకోటి తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావంపై ప్రదర్శన

తిరువూరు: జనవరి 5న జరుగనున్న హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని కోరుతూ తిరువూరులో శనివారం ప్రదర్శన నిర్వహించారు. రాజుపేట అష్టలక్ష్మి ఆలయం నుంచి అయ్యప్ప స్వామి దేవస్థానం వరకు జరిగిన ప్రదర్శనలో పలువురు వేద పండితులు, అర్చకులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో లక్ష్య సాధన

ఆగిరిపల్లి: ప్రధానోపాధ్యాయులు పరిపాలన, విద్యాపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా విద్యా లక్ష్యాల సాధన సులభతరమవుతుందని ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష అదనపు సమన్వయ అధికారి కె. పంకజ్‌కుమార్ అన్నారు. తోటపల్లి హీల్ ప్యారడైజ్ అవర్‌లో నిర్వహించనున్న ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఏలూరు జిల్లా ఏఎంఓ రెడ్డి రామారావు, కృష్ణా జిల్లా ఏఎంఓ అశోక్, రిసోర్స్ పర్సన్ పాల్గొన్నారు.

రతన్ టాటాకు నివాళి

తిరువూరు: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా జయంతి కార్యక్రమం స్థానిక శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించారు. రతన్ టాటా చిత్రపటానికి సీనియర్ న్యాయవాది కంచర్ల ముత్యప్రసాద్, వాహినీ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, ఆంధ్రా బ్యాంక్ రిటైర్డు జీఎం గంధం రవికుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రతన్ టాటా సామాజిక సేవా కార్యక్రమాలను వక్తలు వివరించారు.

నిత్యావసరాలు అందజేత

ఆగిరిపల్లి: స్థానిక వేద పాఠశాల రోడ్డులో ఈనెల 25న అగ్నిప్రమాదంలో చిట్టిపోతుల రవికి చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. బాధిత కుటుంబాన్ని స్థానిక నెరుసు రామయ్య చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు నెరుసు రాజేష్ శనివారం పరామర్శించి వారికి నిత్యావసర సరుకులను అందజేశారు.

ఆరోగ్య కార్యకర్తలు అండగా ఉండాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సమాజంలో మానసిక రుగ్మతలతో ఇబ్బందులు పడుతున్న వారికి ఆరోగ్య కార్యకర్తలు బాసటగా నిలవాలని పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు విజయకుమార్ అన్నారు. వాసవ్య మహిళా మండలి, లీవ్ లవ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మానసిక రుగ్మతలపై ఆశాలు, ఏఎన్‌ఎంలకు శనివారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ రామారావు, సంస్థ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శనివారం అధికారులు సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. విస్సన్నపేట మండలం చంద్రుపట్ల బాణావతు తండాలో సారా తయారీకి సిద్ధం చేసిన 700 లీటర్ల బెల్లం ఊటను ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్ ధ్వంసం చేశారు. ఎ. కొండూరు మండలం గోపాలపురంలో సారా విక్రయిస్తున్న దారావత్ రామును అరెస్టు చేసి తిరువూరు కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు.

ఇటుక బట్టీల యజమానులకు నోటీసులు

మైలవరం: రెడ్డిగూడెం మండలం నాగులూరు గ్రామంలో రహదారి పక్కన ఇళ్ల సమీపంలో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీల తొలగింపుపై జరిగిన ధర్నాపై శనివారం మండలంలోని అన్ని ఇటుక బట్టీల యజమానులకు హైకోర్టు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నోటీసులు పంపాయని ఆర్ఐ గంధం పుల్లయ్య తెలిపారు. బట్టీల యజమానులకు నోటీసులు అందజేశామన్నారు.

నేడు మాదిగ పారిశ్రామికవేత్తల సదస్సు

ముసునూరు: ప్రపంచ మాదిగ దినోత్సవం సందర్భంగా ఆదివారం హనుమాన్ జంక్షన్‌లో మాదిగ పారిశ్రామికవేత్తల సదస్సు నిర్వహిస్తామని ప్రోగ్రాం కన్వీనర్, ఏపీ హైకోర్టు న్యాయవాది మేడూరి నవీన్‌దాస్ తెలిపారు. మండలంలోని మాదిగ మేధావులు, ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు పాల్గొనాలని కోరారు.

డిజైన్ థింకింగ్ ఇన్నోవేషన్స్‌పై అవగాహన పెంపొందాలి

మైలవరం: డిజైన్ థింకింగ్, ఇన్నోవేషన్స్‌పై అధ్యాపకులు అవగాహన పెంచుకోవాలని కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె. నరసింహరాజు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ట్రిపుల్ ఈ విభాగంలో డిజైన్ థింకింగ్, ఇన్నోవేషన్ అంశంపై ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ జె. శివ వరప్రసాద్ కన్వీనర్‌గా, కేఎస్ఎల్ లావణ్య, ఆర్. పద్మ కో-ఆర్డినేటర్లుగా వ్యవహరించారు. డీన్స్, వివిధ విభాగాధిపతులు, 65 మంది వివిధ బ్రాంచ్ అధ్యాపకులు, ఐక్యూ ఏసీ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు వ్యక్తులకు ఫుడ్‌కోర్టు అప్పగింత వెనుక కుట్ర

- టీఎల్ఎఫ్ ఎందుకు నిర్వహించడం లేదు
- కమిషనర్‌ను నిలదీసిన కౌన్సిలర్లు



మాట్లాడుతున్న కౌన్సిలర్లు పగడాల సత్యనారాయణ, నాగమల్లేశ్వరరావు

నూజివీడు: పట్టణంలోని డ్వాక్రా సంఘాలను పర్యవేక్షించే టౌన్ లెవెల్ ఫెడరేషన్ (టీఎల్ఎఫ్)కు కేటాయించిన ట్రిపుల్ ఐటీ ఫుడ్ కోర్టు, ఫ్యాన్సీ షాపులను టీఎల్ఎఫ్ నిర్వహించకుండా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని పలువురు కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. టీఎల్ఎఫ్‌తో ట్రిపుల్ ఐటీ ఒప్పందం కుదుర్చుకుంటుంటే కౌన్సిల్‌కు ఎందుకు తెలపలేదని మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డిని నిలదీశారు. నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. కౌన్సిలర్లు పగడాల సత్యనారాయణ, నవుడు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీలోని ఫుడ్ కోర్టు, పలు ఫ్యాన్సీ షాపులు టీఎల్ఎఫ్‌కు కేటాయిస్తూ ట్రిపుల్ ఐటీ అధికారులు టీఎల్ఎఫ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారని, టీఎల్ఎఫ్ వాటిని నిర్వహించకుండా వెంటనే ప్రైవేటు వ్యక్తులకు ఎందుకు అప్పగించారని నిలదీశారు. ఫుడ్‌కోర్టును టెండర్లు పిలిచి ఇవ్వడం వల్ల ట్రిపుల్ ఐటీకి నెలకు రూ.6 లక్షల అద్దె వచ్చేదని, టీఎల్ఎఫ్‌కు అప్పగించడంతో అద్దె రూ.6 లక్షల నుంచి రూ.42 వేలకు తగ్గించేశారన్నారు. ఫుడ్ కోర్టును టీఎల్ఎఫ్ నిర్వహించకుండా అదే రూ.42 వేల అద్దెకు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడమేమిటని ప్రశ్నించారు. మెప్మాతో మున్సిపాలిటీకి సంబంధం లేదని, దానికి పీడీ ఉంటారని బదులిచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంబేడ్కర్ సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుకు అనుమతినివ్వాలని అజెండాలో పెడితే జీఓ 18 ప్రకారం 8 మంది అధికారుల అనుమతులు తీసుకోవాలని చెప్తున్నారని, బస్టాండు వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన విగ్రహానికి అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ డీఈ కె. వెంకట్రావు, కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి త్రివేణీదుర్గ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యలకు పరిష్కారం



పైడూరుపాడులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచి సీతారామయ్య



ఆగిరిపల్లి సదస్సులోని అర్జీలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

ఆంజనేయపురం(తిరువూరురూరల్): మండలంలోని ఆంజనేయపురంలో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. సర్పంచి మామిడి కుటుంబరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో పలువురు రైతులు సమస్యలపై అర్జీలు సమర్పించారు. డెప్యూటీ తహసీల్దారు ప్రసన్నకుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మోహన్, మండల సర్వేయర్ గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి తేనె నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ సర్వే చేయాలి..

పైడూరుపాడు(విజయవాడరూరల్): పైడూరుపాడు గ్రామంలో వ్యవసాయ భూములను మళ్లీ సర్వే చేయాలని కోరుతూ సర్పంచి వేముల సీతారామయ్య తహసీల్దార్ బి.సుగుణకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యాలయం శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామంలో నిర్వహించిన రీ సర్వేలో అనేక లోపాలు చోటుచేసుకున్నాయని రైతులు ఆరోపిస్తున్నారని చెప్పారు. 2018లో పేదలకు పంపిణీ చేసిన ఇళ్లస్థలాలకు సరిహద్దులు నిర్ణయించాలని లబ్ధిదారులు తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. మాజీ సర్పంచి రంగినేని నరేంద్ర, రైతులు, ఆర్ఐ రాజేష్, సర్వేయర్ జనార్దనరావు పాల్గొన్నారు.

- **ఆగిరిపల్లి:** రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ బి. స్మరణ్‌రాజ్ అన్నారు. ఆగిరిపల్లి సచివాలయంలో తహసీల్దార్ ప్రసాద్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సు ఆయన మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలపై, దరఖాస్తులు, ఫిర్యాదులు అందజేస్తే పరిష్కరిస్తామన్నారు. మండలం పరిధిలోని గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో పలు సమస్యలపై 160 అర్జీలు అందాయని, వాటిలో ఇప్పటి వరకు 110 అర్జీల్లో పేర్కొన్న సమస్యలను పరిష్కరించామని చెప్పారు. ఆగిరిపల్లి సచివాలయంలో నిర్వహించిన సదస్సులో 16 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. సర్పంచ్ చొటపల్లిలక్ష్మి, రీ సర్వే డెప్యూటీ తహసీల్దార్ మరియన్న, ఆర్ఐ యూనస్, మండల సర్వేయర్ గంగరాజు, వీఆర్వోలు పాల్గొన్నారు.
- **చాట్రాయి:** భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి అధికారులు చాట్రాయిలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు అర్జీలు అందాయని, త్వరలో వాటని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ డి. ప్రశాంతి తెలిపారు.
- **కొర్లమండ(విస్సన్నపేట):** కొర్లమండలో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి మాట్లాడుతూ రైతుల నుంచి ఏడు అర్జీలు అందాయని, పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- **ముసునూరు:** గోపవరంలో సర్పంచ్ కంచర్ల వాణి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 12 అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ జి.పురుషోత్తమ శర్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేద్దాం

ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ

జి.కొండూరు: గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. జి.కొండూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన స్థానిక కమ్యూనిటీ హాల్‌లో శనివారం నిర్వహించారు. గత సమావేశంలో తీర్మానించిన అభివృద్ధి పనుల పురోగతిని ఎంపీపీ అడిగి తెలుసుకున్నారు. శాఖల వారీగా అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలు, పరిష్కార మార్గాలు వంటి అంశాలపై సమీక్షించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్య సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత సమావేశంలో తీర్మానించి ప్రారంభం కాని పనులకు ఈ సమావేశంలో మరోసారి తీర్మానించారు. జి.కొండూరు, పినపాక గ్రామాల్లోని జగనన్న కాలనీ లేఅవుట్‌లలో అంతర్గత రహదారుల అభివృద్ధికి రూ.10లక్షలు, కుంటముక్కల గురుకుల పాఠశాలకు కృష్ణా వాటర్ పైపులైన్ ఏర్పాటు నిమిత్తం రూ.2 లక్షలు పనులకు సభలో సభ్యులు తీర్మానించారు. ఎంపీడీఓ రామకృష్ణనాయక్, వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల వద్ద డ్రోన్‌తో నిఘా



డ్రోన్ టెస్ట్ డ్రైవ్ ప్రారంభించిన సీఐ చంద్రశేఖరరావు, ఎస్ఐ సుధాకర్

మైలవరం: మైలవరం డివిజన్ పోలీస్ స్టేషన్ పరిధిలో క్లౌడ్ పెట్రోలింగ్ వ్యవస్థను మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ శనివారం ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ క్లౌడ్ పెట్రోలింగ్ ద్వారా అత్యాధునిక డ్రోన్ ఉపయోగించి పాఠశాలలు, కళాశాలల వద్ద మహిళలను, పిల్లలను, ఆడపిల్లలను ఇబ్బంది పెట్టే ఆకతాయిలను గుర్తించి, వారిపై తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మైలవరం మండల ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలన్నారు. క్లౌడ్ పెట్రోలింగ్ వ్యవస్థ ద్వారా డ్రోన్ విజువల్స్ తీసి ఆకతాయి పనులు చేసే వారిని గుర్తించి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ కార్మికుల సమస్యలు సత్వరం పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ గత సంవత్సరంలో జరిగిన సమ్మెకాలపు ఒప్పందాలను తక్షణం అమలు చేయాలని, పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం, సేఫ్టీ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలకు ఏర్పాట్లు



తిరువూరులో సీపీఎం జిల్లా మహాసభలకు ఏర్పాట్లు చేస్తున్న కార్యకర్తలు

తిరువూరు: జనవరి 3, 4, 5 తేదీల్లో తిరువూరులో జరుగనున్న సీపీఎం జిల్లా మహాసభలకు పార్టీ నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. తిరువూరు ప్రధాన రహదారిలోని పలు కూడళ్ల వద్ద ఎర్రజెండాల తోరణాలను అలంకరించారు. బైపాస్‌రోడ్డు విఘ్నేశ్వరాలయం సెంటర్, ఫ్యాక్టరీ సెంటర్, బోస్ సెంటర్, చీరాల సెంటర్, బస్టాండు సెంటర్లలో ఆహుతులకు స్వాగతం పలుకుతూ పార్టీ పతాకాలతో అలంకరణ చేశారు. మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా అరుణ తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. తిరువూరు సుగాలీ కాలనీలోని కల్యాణ మండపంలో డెలిగేట్స్ మహాసభ, బోస్ సెంటర్లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. మహాసభ ఏర్పాట్లను జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేకల నాగేంద్రప్రసాద్, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, కోట కల్యాణ్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.